



◐ *27-10-95* సంచికలో 'కళేబరం' కథకు తరువాయి భాగం

తనో దిక్కు గోడ కట్టుకత్తే పోరగాండ్లు ఓ దిక్కు మెల్ల మెల్లగా కూలగొట్టే సరికి కుల పెద్ద మైసయ్య మాటల కోసం తల్లడం మల్లడం అవుతున్నాడు. బొడ్డు దుర్గయ్య 'ఇగ ఈ పని అయ్యేది కాదు' అని మనసులోనే అనుకున్నాడు. నలుగురైదుగురు పెద్దోల్లు తప్ప మిగతా వాళ్లు కనుకయ్యతో ఏకీభవిస్తూ–పోతున్న పొద్దు దిక్కు చూస్తూ 'సమస్య అయిపోయింది ఇగ మీ ఇష్టం' అన్నట్లు పెద్ద మనుషుల వైపు చూస్తున్నారు.

"ఇగ ఆఖరిసారి పెప్తండ్రి– మోయినిరెడ్డి పచ్చిన బర్రె గతేంది? అది అక్కడనే వుండనీయమం టరా? తలో పెయ్యి ఏసి అవతల పారేద్దామంటరా పెప్తండ్రి" మైసయ్య సూటిగా అడిగాడు.

"రామాయనం అంత ఇని సీత రామునికి ఏమైతదన్నట్లుంది, మైసు తాత నీ యవారం. మేమైతే అచ్చేది లేదు. ఇగ ఆ పనులు సేసేది లేదు. ఎనుకటోల్లు, మీ ఇట్టం ఏమన్నా సేసుకోండ్రి. కైకిలి పనికి పొద్దుపోద్ది ఇగ పోతం" హనుమంతు మైసయ్య ప్రశ్నకు ఖరాఖండిగా జవాబు ఇచ్చాడు.

కూచున్న వాళ్ళల్లో నలుగురైదుగురు పెద్ద మనుషులు మోహన్‌రెడ్డి వైపు అయితే మిగతావాళ్ళు ఇది కలువని పని అని లేచి మైసయ్యకు చెప్పి ఎవరి ఇళ్ళలోకి వాళ్ళు తొందర తొందరగా పెద్ద మనుషుల మీద గులుక్కుంటూ వెళ్ళిపోయారు.

మర్రిచెట్టు కింద మిగిలిన పెద్ద మనుషులు మళ్ళీ పచ్చిన బర్రెను ఎట్లా మోసుడు అనీ, మోహన్‌రెడ్డి పటేలు నిన్నటి నుంచీ ఎంత బాధపడుతుండోననీ, ఇయ్యాల్ల రేపటి పిల్లగాళ్ళతోటి మాట్లాడ వశం అయ్యేది లేదనీ– ఎవరి ఆలోచనల్లో వాళ్ళే మునిగిపోయారు.

ఇక ఎట్లా అని అనుకుంటుండగానే "మైసయ్యా! పటేలు పిలువక రమ్మన్నడని" సుంకరి పోచాలు వచ్చి పిలిచాడు.

పోచాలు పిలువుకు మైసయ్యా మిగతావారు "గటే అత్తన్నం పా. నువ్ నడువ్" అని లేచారు.

బొడ్డు దుర్గయ్య ఏదో జ్ఞాపకం వచ్చి 'జెర్ర సేపాగుండ్రి జెప్పన అత్త'నని ఇంటి దిక్కు పెద్ద అడుగులతో నడిచాడు.

మోహన్‌రెడ్డి మీద జాలితోనైతేనేమి, కుల 'కష్టి' మీది మమకారంతో నైతేనేమి మైసయ్య బొడ్డు దుర్గయ్యతోపాటు ఇంకో ముగ్గురు పెద్ద మనుషులు కలిసి ఊరివైపు నడిచారు.

* * *

మోహన్‌రెడ్డి ఇంటి ముందర గద్దె మీద కూర్చున్నాడు. ఆయనకు చెరో పక్కన మరో ఇద్దరు రెడ్లు కూర్చొని చచ్చిన బర్రె మీది సానుభూతి కన్నా బర్రెను నిన్నటి నుండి తీసుకపోని రాని మాదుగుల మీద కోపాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంట్లో మోహన్‌రెడ్డి భార్య బతుకు తెరువైన వున్న ఒక్క దిక్కు పోయేసరికి ఇక ముందు ఎట్లానని సన్నగా ఏడుస్తూంది. చచ్చిన బర్రె చిన్న 'దుడ్డె' ఇవేమీ పట్ట నట్టు వీటన్నిటికీ అతీతంగా బజార్ల అటూ ఇటూ 'సెంగడ బింగడ' దుంకుకుంటూ ఉరుకుతూంది. మోహన్‌రెడ్డి విచారంగా మాదిగలు వచ్చే దిక్కు చూస్తున్నాడు.

కొంచెం దూరంల గదువ కింద కట్టెను ఆనించి నిలుచున్న సుంకరి పోచాలు 'పటేల మాదిగ మైసయ్య అత్తుండు' అన్నాడు.

చిన్నబోయి కూర్చున్న మోహన్‌రెడ్డి ముఖంలో ఒక వెలుగు రేఖ వెలిగింది. మిగతా రెడ్ల మనసులలో మాదిగల మీద కోపం కుతకుతలాడుతూంది.

కట్టెలు లేకుండా ఉత్తచేతులలోని వస్తున్న మైసయ్య తదితరులను చూసేసరికి మోహన్‌రెడ్డి ముఖం ముడుచుకుపోయింది. ఏమి వినాల్సి వస్తుందోనని 'అహం' కిందా మీదా బొర్లుతూంది.

మైసయ్య ముఖం మోహన్‌రెడ్డి చూసాడు. మైసయ్య తప్ప చేసినట్టు దోషిలా కూడా వచ్చిన నలుగురితోపాటు తలలు కిందికి వేసి భూమిని చూస్తున్నారు.

"ఆ! మాదుగులు నిన్నటి నుంచి సెప్పంపంగ సెప్పంపంగ గిప్పడా వచ్చేది? గదేనా 'మునాసం' అంటే?" మోహనరెడ్డి పక్కనున్న రెడ్డి దీర్ఘాలు తీస్తూ కారెడ్డంగా అన్నాడు.

మోహన్‌రెడ్డి "అవన్నీ ఇప్పడెందుకు పోనీయ్" అని చెయ్యితోనే వారించాడు.

"అయ్యా! మోయినిరెడ్డి పటేలా! బాంచెన్! నిన్న తమరు సెప్పంపిన్నుంచీ తొక్కులాడుతున్నం, బర్రెను దొడ్లె నుంచి ఊరినతల గుంజేయాలనని మిగతా వాళ్ళతోని 'ఇమరన' సేత్తునే వున్న. మేము మోసుకుపోదామంటే ముసలోల్లమైపోతిమి. సాతగాదని పదుసు పోరగాల్లతోని సెప్పి తీసుకవద్దామంటే– అందరూ ఎములాడ ఊళ్ళకు పనికిపోయి రాత్రవంగ ఇండ్లల్లకు అచ్చిన్రు. ఇయ్యాల పొద్దుగాల పిలిసి అడుగుతె...." ఇగ నువ్వు సెప్ప పొద్దుగాల జరిగింది అని మైసయ్య దుర్గయ్య దిక్కు చెప్పమన్నట్టు చూసాడు.

మోహనరెడ్డికి విషయం అర్థం అయ్యింది. వచ్చిన మాదిగలు బర్రెను మోసుకుపోవటానికి కాకుండా పంచాయిష్ చెప్పడానికి వచ్చారని తెలిసిపోయింది. పక్కనున్న రెడ్డిలు ఊ అంటే తోకతొక్కిన తాచుల్లా లేవడానికి ఉద్యుక్తులవుతున్నారు. మోహన్‌రెడ్డికి కోపం లేదని కాదు. పైకి కనపడనీయడు కానీ కండ్లతోని నవ్వుకుంటూ కడుపులో కత్తులు దించే తత్వం. అంత తొందరగా బయటపడడు. కాలం తోపాటు మారినట్టు కనబడే అవకాశం కోసం ఎదురుచూసే తేనె పూసిన కత్తి.

"అయితే మైసయ్యా! ఇప్పడు అనగల్ల ముచ్చ

టేంది? గదంతా తప్పీలు నాకు తెలువది" మోహన్‌రెడ్డి మనుగారంగా మెల్లగా అన్నాడు.

బొడ్డు దుర్గయ్య మైసయ్య వదిలిపెట్టిన విషయం గూర్చి "కాలం మారింది అయినా ఎందుకైనా మంచిదని మా పిల్లగాండ్లను అడిగినం. అల్లు 'పాతలు లేవు. వడ్ల 'ఎరాలు' బందు అయినయ్. మన కుల కష్టి ఎన్నడో పోయింది. మేము వచ్చిన పసురాలను మోయమని కట్టె ఇరిసినట్టు తెగేసి సెప్పింద్రు బాంచెన్! వచ్చినవాట్నే మోసే కట్టెలు మా ఇండ్లల్ల నుండి కనిపియ్యకుంట ఎటో పోయినయ్. ఏండ్ల కింద మా ఇండ్ల సూర్లకు సెక్కిన అరె, కత్తులు 'సిలుం' పట్టి మొండిపోయినయ్. పటేల! మీరు అందరి తోటోల్లు కాదు అని మొత్తుకున్నాం. గీ ఒక్కపారి పటేలు పని ఒడ్డు ఎక్కియ్యాల్లని బతిమిలాడినం. గని మా పోరగాల్లు ఇనలేదు. అల్లకత అల్లు సెప్పింద్రు. గదంత ఎందుకు గని పటేలా! ఎట్లనో మీరే సెప్పుంద్రి" అని మోహన్‌రెడ్డి మీద భారాన్ని ఎత్తాడు.

"మీరే సెప్పుంద్రి" చివరి మాటతో అక్కడున్న మిగతావారికి కత్తితో గాటు పెట్టి కారం పూసినట్టు అయ్యింది. బూతులు తిట్టి ఏ కీలుకు ఆ కీలు విరుగ కొడుదామా అన్నట్టు మోహన్‌రెడ్డి వైపు చూసారు.

ఆలస్యం చేస్తే వ్యవహారం చెడిపొయ్యేలా వుందని "మైసయ్యా! గిన్ని ఏండ్ల నుంచి లేంది గిప్పుడు నా ఇంట్ల పనిపడితే గిట్ల అంటే ఏమన్నా మంచిదా చెప్పు. బాధకో బలిమీదికో ఎవల పని వాళ్ళు చెయ్యాలె గాని ఒకల పని ఒకరు ఏట్లా చేత్తరు? 'పాతలు' పోయినయ్. 'ఎరాలు' బందైనయ్. నిజమే! కులాలు అయితే పోలేదు కదా! మా వాగండ్లకు నైలాన్ తాళ్ళు రావచ్చు. మా ఎడ్లకు నూలు 'ముగుదాళ్ళు' రావచ్చు. కిర్రు చెప్పులు పోయి రబ్బరు చెప్పులు మా కాళ్ళకు రావచ్చు. కానీ మా ఇండ్లు మీయో, మీ ఇండ్లు మాయో కాలేదు కదా! మైసయ్యా! ఏమి చేస్తరో ఏమి చెయ్యరో నాకు తెలువదు. ఒకరియ్ ఒకరు తప్పుకుంటే పెంకాసులు బయటపడుతయ్. నా పని గట్టెక్కియ్యుంద్రి గంతే!" మోహన్‌రెడ్డి బుజ్జగిస్తూ అన్నాడు.

మైసయ్య దుర్గయ్యను – దుర్గయ్య మిగతా వారిని కండ్లతోనే ప్రశ్నించాడు. మోహన్‌రెడ్డి చెప్పింది నిజమే కదా! 'ఎలా?' అనే మీమాంసలో పడిపోయారు.

ఎండ చురుక్కుమని కొడుతుంది. మైసయ్య, దుర్గయ్య మిగతావారి శరీరాలు 'చిమ చిమ' లాడుతున్నాయి. సమస్య మాది కాదు మీదేనని తెగేసి చెప్పిన మోహన్‌రెడ్డి మాటలకు దుర్గయ్య పెదవివి కొరికిపడుతూ కోపాన్ని దిగమింగుతున్నాడు. తమను చుట్టుముడుతున్న సమస్య నుంచి ఎలా బయటపడదామా అని మైసయ్య కాలి వేలితో నేల మీద గీతలు గీస్తున్నాడు.

"పటేలా! గవన్ని ఇప్పుడెందుకుగాని... మా పోరగాండ్లు జారిసింద్రు. మా తోటి మోసుడు పాతకాదు. ఏదో మునుపటి మర్యాదకు సెప్పిపోదామని అచ్చినం. మీరే సెప్పుంద్రి." మైసయ్య మన్నుమల విషయం చెప్పాడు.

మోహన్‌రెడ్డి మీరే చెప్పుంద్రి అంటే- మైసయ్య మోహన్‌రెడ్డిని మీరే చెప్పుంద్రి అని కొంచెంసేపు వరకూ తగాదా పడ్డారు. అయినా సమస్య ముడి రేలానే వుంది కానీ పరిష్కారమయ్యేలా కనిపించలేదు. నీవెంత అంటే నీ వెంతా అనుకోవచ్చు కానీ ఇది అనుకొనటానికి వేళకాదు అని మోహన్‌రెడ్డికి తెలుసు. ఇంతకు ఎక్కువ మాట్లాడేది లేదని మైసయ్య వాళ్ళు మనసులలోనే తీర్మానించుకున్నారు.

"ఇగ అయిందేదో అయ్యింది. మోసుడు మాతోటి కాదు. వచ్చిన బర్రెను మీరు ఇంట్ల వుంచుకుమదు మీ వల్ల అయ్యేది కాదు. నేను ఒగ మాటంటే ఎవలకు కోపం కాదు గదా!" బొడ్డు దుర్గయ్య చివరికి అన్నాడు.

"దుర్గయ్యా! సెప్పు, కోపమత్తే అరేదా తీరేదా సెప్పు సరే" మోహన్‌రెడ్డి అన్నాడు.

"ఏమి లేదు పటేలా! పెద్ద బండి ఎడ్లు వున్నయ్ కదా! బర్రెను మనిషికో సెయ్యేసి దాంట్ల ఏసుకపోయి వక్కల బండకాడ పారేత్తం" బొడ్డు దుర్గయ్య చెప్పాడు.

పైగా కాలం మంచిగ లేదు. ఎటు పొయ్యి ఎటు వస్తుందో తెలువదు. ఈ పరిష్కారం మధ్యే మార్గంగా మోహన్‌రెడ్డికి ఆమోదమయ్యింది. మిగతా రెడ్లకు మోహన్‌రెడ్డి గతే ఇలా అయితే తమకు పని పడ్డప్పుడు ఎలా అని అసంతృప్తితో గుర్రుగా చూసారు.

సరే అంటే సరే- అలాగే అంటే అలాగేననుకొని మైసయ్య దుర్గయ్యా మిగతా వాళ్ళు పశువుల దొడ్లోకి నడిచారు. మోహన్‌రెడ్డి పాలేరు బండికట్టి ఇంటి ముందు నిలబెట్టాడు.

కాళ్ళు బార్లా చాపి బర్రె పడిపోయి వుంది. భూమి మీద కాళ్ళు కొట్టుకున్న జాడలు కనిపిస్తున్నాయి. కండ్లు అలాగే తెలేసి వున్నాయి. పెండలనే పడి ప్రాణాలు విడిచింది. ఉచ్చ పెండతో కలిసి ఆ ప్రాంతమంతా 'గెదదు గెదదు' వాసనగా వుంది.

మైసయ్య తదితరులు బర్రె వెనుకవైపు పడితే మోహన్‌రెడ్డి మిగతా వాళ్ళు కొమ్ములు, తల వైపు ఎసుంటి కాలమచ్చిందంటూ పట్టుకున్నారు. అతికష్టం మీద బర్రెను లేపట్టేసరికి ఒక్కసారి వాసనా 'రప్పన' కొట్టింది. ఈగలు బయ్యన లేచాయి. మోహన్‌రెడ్డి వాళ్ళు బర్రెను ఇడిసి ముక్కులు మూసుకున్నారు. మైసయ్య వాళ్ళు 'ఉగ'తో 'పట్టుంద్రి బాంచెన్ ఇగ అయిపాయె'నని మిగతా వారిని పనికోసం పురికొల్పుతున్నారు.

కిందా మీదా పడి బర్రెను బండి పైకి చేర్చారు. లోపల నుంచి సన్నగా ఏడుస్తున్న మోహన్‌రెడ్డి భార్య గొంతెత్తి దుఃఖిస్తూంది.

ఎండ నడినెత్తి మీదికి వచ్చింది. బర్రె చచ్చిన వాసన ఇప్పుడు మెల్లమెల్లగా ఊరంతా వ్యాపిస్తూంది. నీడపట్టున వుండే నంది పలుచ పలుచగా కనిపిస్తున్నారు. ఊరు ఎవరో చచ్చిపోతే ఇడిసిపెట్టినట్టు దిగులుగా వుంది. బర్రెను వక్కల బండవైపు మోసుకుపోతున్న బండి వెనుక మైసయ్య దుర్గయ్య ఇతరులు నడుస్తున్నారు. బొడ్డు దుర్గయ్య ఇంటి నుంచి ఎందుకైనా పనికొస్తదని తీసుకొచ్చి రాండికి చెక్కిన కత్తి పైకి లేచేసరికి అగి సర్దుకుని జనము లేక 'కుయ్యి'మంటూ మొత్తుకుంటున్న బండి వెనుక అడుగులు వేస్తున్నాడు. ఊరి చుట్టూ పొలాలు చెరువుకు గండి పడి బీడు పడి వున్నాయి. మైసయ్య వెనుకకు తిరిగి ఊరి వైపు చూసాడు. శ్రమ సందడి, నీటి గలగల, మనుషుల సంచారం లేక ఊరు ఇప్పుడు కళేబరంలా అనిపించి మైసయ్య గుండెల్లో దేవినట్లయ్యింది. ◆

## గమనిక

27–10–'95 'ఆంధ్రజ్యోతి' ఈ వారం కథగా, జూకంటి జగన్నాథంగారి 'కళేబరం' కథని ప్రచురించిన సంగతి పాఠకులకు తెలిసిందే.

తెలంగాణా మాండలికంలో, దళిత జీవితాన్నీ, గ్రామీణ వ్యవస్థలో వచ్చిన మార్పుల్నీ ప్రతీకాత్మకంగా చిత్రించదలచిన ఆ కథనిఅంతవరకే వుంచడం అసమగ్రంగా భావించిన రచయిత తః ముగింపునిచ్చారు. రచయిత కోరిక మేరకు ఆ మిగతా భాగాన్ని ప్రచురిస్తున్నాము. 27–10–'95 సంచికలోని 'కళేబరం' కథకు కొనసాగింపుగా దీన్ని చదువుకోవలసిందిగా పాఠకులను కోరుతున్నాము. ఇది కొంత అసాకర్యమే అయినా, కొత్త ప్రయోగంగా పాఠకులు ఆదరిస్తారని నమ్ముతున్నాము.

– ఎడిటర్